క్లుప్తంగా

మడకశిర ఎక్సైజ్ సీఐగా సోమశేఖర్

మడకశిర: మడకశిర ఎక్సైజ్ సీఐగా సోమశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు సీఐగా ఉన్న ప్రసాద్‌రావు సెలవుపై వెళ్లారు. విడపనకల్లు చెక్‌పోస్ట్‌లో పని చేస్తున్న సోమశేఖర్‌ను మడకశిర ఎక్సైజ్ సీఐగా నియమించారు. నూతన సీఐ సోమశేఖర్ మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గంలో అక్రమ మద్యం రవాణాను అరికడతామని తెలిపారు. కర్ణాటక మద్యంపై సరిహద్దు ప్రాంతాల్లో గట్టి నిఘా పెంచుతామని తెలిపారు.

పుస్కకావిష్కరణ



ఫన్నీ టిట్ బిట్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

హిందూపురం టౌన్: డాక్టర్ కేఎస్ ఇందిరమ్మ రచించిన ఫన్నీ టిట్ బిట్స్ అనే ఇంగ్లిష్ ఒకాబులరీ, గ్రామర్ బుక్‌ను గురువారం స్థానిక లయన్స్ క్లబ్‌లో ఆవిష్కరించారు. మూడో తరగతి నుంచి పదవ తరగతి వరకూ ఈ బుక్స్ చాలా ఉపయోగపడతాయని వక్తలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పద్మ ప్రియ, లేపాక్షి ఎంఈఓలు నాగరాజు, కుల్లాయప్ప, హిందూపురం ఎంఈఓలు గంగప్ప, ప్రసన్న లక్ష్మి, పరిగి ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం పాల్గొన్నారు.

శుభకార్యం

గోరంట్ల: ఉగ్రరాంపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రవి వివాహం స్థానిక టీటీడీ కళ్యాణ మండంలో గురువారం జరిగింది. వైఎస్సార్ సీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి, పెనుకొండ నియోజకవర్గ సమన్వయ కర్త ఉషశ్రీ హాజరై నూతన వధూవరులు రవి, తులసిని ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రఘురామిరెడ్డి, మండలకన్వీనర్ వీరనారాయణరెడ్డి, వానవోలు నాయకులు, బయపరెడ్డి, నారప్ప, శ్రీనివాసులు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'పది' టాపర్‌కు సన్మానం



విద్యార్థిని రక్షితను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: లేపాక్షి మండలం శిరివరం గ్రామానికి చెందిన రక్షిత అనే విద్యార్థిని 10వ తరగతి ఫలితాల్లో 591 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. గురువారం సువర్ణభారతి జూనియర్ కళాశాలలో విద్యార్థిని రక్షితను కళాశాల కార్యదర్శి అనిల్ కుమార్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బాబావలి, చిన్మయ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు వెంకట్ ఘనంగా సన్మానించారు. రైతు బిడ్డ రక్షిత.. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా ప్రభుత్వ బడిలో చదివి మండల స్థాయిలో టాపర్‌గా నిలిచిందని కొనియాడారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



హెచ్ఆర్ పాళ్యంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

మడకశిరరూరల్: మండలంలోని రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా పంటలు సాగు చేసి ఆదాయం పొందాలని డివిజన్ ఇన్‌చార్జ్ రమేష్, రైతు సాధికార సంస్థ కమ్యూనికేషన్ టీమ్ సభ్యులు కీర్తన, మల్లేశ్వరి, తెలిపారు. గురువారం ఆమిదాలగొంది యూనిట్ పరిధిలోని హెచ్‌ఆర్‌పాళ్యం, ఈ రామగిరి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏటీఎం, ఏగ్రేడ్ మోడల్ విధానంపై వివరించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ మంజునాథ్, డీఎంఎంటీఎస్, హెల్త్ అండ్ న్యూట్రిషన్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాల అలంకరణలో నల్లరాళ్ల గంగమ్మ



అలంకరణలో నల్లరాళ్ల గంగమ్మ దేవత

పావగడ: పట్టణంలోని నల్లరాళ్ల గంగమ్మ జాతరలో భాగంగా గురువారం ఆదిశక్తి నల్లరాళ్ల గంగమ్మ దేవి ముత్యాల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం పూజలు చేశారు. అనంతరం రాత్రి అమ్మవారికి ముత్యాల అలంకారం నిర్వహించారు. ముత్యాల అలంకారంలో అమ్మవారు దేదీప్యమానంగా వెలుగొందారు. అగ్నిగుండ కార్యక్రమం ఆకట్టుకుంది.

అమాత్యా.. దయ చూపరూ

- మడకశిర ఆర్టీసీ డిపోలో రాజ్యమేలుతున్న సమస్యలు
- రేపు పర్యటించనున్న రవాణాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి
- కార్మికులు ఆందోళనలు చేసినా ఫలితం శూన్యం
- బస్టాండే డిపో కార్యాలయంగా మారిన వైనం
- డ్రైవర్లు, కండక్టర్ల కొరతతో ఇబ్బందులు





మడకశిర ఆర్టీసీ బస్టాండ్‌ను డిపో కార్యాలయంగా ఉపయోగించుకుంటున్న దృశ్యం, సమస్యలపై నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు (ఫైల్)

మడకశిర: కర్ణాటక సరిహద్దులో ఉన్న మడకశిరలో ప్రగతి రథం మొండికేసింది. ఆర్టీసీ డిపోలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. డిపో ఉన్నా బస్టాండే కార్యాలయంగా మారిపోయింది. దీంతో ఆర్టీసీ కార్మికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడి సమస్యలు అక్కడే అన్నట్లు ఉన్నాయి. కండక్టర్లు, డ్రైవర్ల కొరత వేధిస్తోంది. కార్మికులు ఆందోళనలు చేసినా ఫలితంలేదు.

రవాణాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి శనివారం మడకశిరలో పర్యటించనున్నారు. డిపోను కూడా సందర్శించనున్నారు. ఈనేపథ్యంలో డిపో సమస్యలు పరిష్కారానికి నోచుకునేనా అని కార్మికులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

మడకశిరలో అనేక సమస్యలతో కార్మికులు సతమతమవుతున్నారు. ప్రధానంగా మడకశిర డిపోకు సరైన కార్యాలయం లేదు. డిపో మేనేజర్‌కు ప్రత్యేకంగా కార్యాలయాన్ని నిర్వహించుకోవడానికి గది కూడా లేదు.డిపోలో పని చేసే సిబ్బంది విధులు నిర్వహించడానికి సరైన గదుల సౌకర్యం కూడా లేదు. ఆర్టీసీ కార్మికులకు విశ్రాంతి గదులు కూడా లేవని వాపోతున్నారు. డిపోలో సీసీ రోడ్లను కూడా వేయలేదు.

డొక్కు బస్సులతో ఇబ్బందులు

మడకశిర డిపో పరిధిలో దాదాపు 30 బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. ఇందులో 90 శాతం డొక్కు బస్సులే. అంతే కాకుండా చాలా బస్సులకు కాలం చెల్లాయి. కొత్త బస్సులు రాక డొక్కు బస్సులనే నడుపుతున్నారు. దీంతో ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా డ్రైవర్లు, కండక్టర్ల కొరత కూడా ఉంది. డ్రైవర్లు 68, కండెక్టర్లు 45 మంది మాత్రమే ఉన్నారు. డ్రైవర్లు 10 మంది, కండక్టర్లు 15 మంది చొప్పున తక్కువగా ఉన్నారు. దీంతో బస్సులను నడపడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆర్టీసీ అధికారులు అంటున్నారు.

ఆర్టీసీ బస్టాండే డిపో కార్యాలయం

మడకశిరలో ఆర్టీసీ బస్టాండే డిపో కార్యాలయంగా మారింది. డిపో గదుల కొరత ఉండడంతో ఆర్టీసీ బస్టాండ్‌నే డిపో కార్యాలయంగా ఉపయోగించుకుంటున్నారు. డీఎం ఆఫీస్‌ను కూడా ఆర్టీసీ బస్టాండ్లోని ఓ గదిలోనే నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆర్టీసీ బస్టాండ్ పట్టణానికి దూరంగా ఉంది. దీంతో ఈ బస్టాండ్ ప్రయాణికులకు ఏమాత్రం ఉపయోగ పడడం లేదు. పట్టణానికి సమీపంలో ఆర్టీసీ బస్టాండ్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. శ్రీశైలం బస్సును అమరాపురం నుంచి నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. అమరాపురం ప్రాంతంలో శివభక్తులు అధికంగా ఉన్నారు. దీంతో ఈబస్సు సర్వీసును అమరాపురం నుంచి నడపడానికి మంత్రి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ఈబస్సు సర్వీసుకు వెళ్లే ఆర్టీసీ కార్మికులకు 3 రోజుల మస్టర్ ఇవ్వడానికి మంత్రి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మంత్రి పర్యటనపై కార్మికుల ఆశలు

మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి పర్యటనపై ఆర్టీసీ కార్మికులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. డిపో సమస్యలు పరిష్కారమవుతాయని భావిస్తున్నారు. ఆర్టీసీ కార్మికులు కూడా డిపో సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. డిపో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్‌ఎంయూ, ఈయూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. అయినా డిపో సమస్యలను పరిష్కారం కాలేదు. మంత్రి పర్యటనతోనైనా డిపో సమస్యలు పరిష్కారమవుతాయో లేదో వేచి చూడాల్సిందే.

మంత్రికి విన్నవిస్తాం

మడకశిర డిపో సమస్యలపై మంత్రికి వినతి పత్రం అందిస్తాం.అంతే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ కార్మికుల సమస్యలను కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్తాం. మడకశిర డిపో నుండి అంతర్‌రాష్ట్ర బస్సు సర్వీసులను నడపాలని మంత్రిని కోరుతాం. మంత్రి మడకశిర డిపో సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలి.

– జయసింహ, ఎస్‌ఎంయూ నాయకుడు, మడకశిర

సమస్యలు పరిష్కరించాలి

మంత్రి పర్యటనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. మంత్రి నిరాశ పరచకుండా తమ సమస్యలు పరిష్కరిస్తారని భావిస్తున్నాం. డిపోలో సిబ్బంది కొరతను తీర్చాలి. డిపో అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా ఆర్టీసీ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా అనే సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలన్నీ పరిష్కరించి ఆదుకోవాలి.

– రఫిక్, ఈయూ అధ్యక్షుడు, మడకశిర

అబద్ధపు హామీలతో మోసపోయాం



స్థానికులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

- జగన్ పాలనే భేష్
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణతో ప్రజలు

గోరంట్ల: ఎన్నికల ముందు కూటమి నేతలు, ఇచ్చిన అబద్ధపు హామీలతో మోసపోయామని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనే భేషుగా ఉండేదని మాజీ మంత్రి, పెనుకొండ ఇన్‌చార్జ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఎదుట ప్రజలు తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. గురువారం పట్టణంలోని నాలుగో వార్డులో ఆమె కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వార్డులో ప్రతి గడపకూ వెళ్లి కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలు అందుతున్నాయా అని ప్రజలను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ప్రజలు ప్రజలు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి దాదాపు 10 నెలలు పూర్తి కావస్తోందని ఇచ్చిన హామీలు గాలికోదిలేసి ప్రజలను నిలువునా మోసం చేశారని బదులిచ్చారు. సూపర్ సిక్స్ పథకాల్లో మహిళ ఉచిత బస్సు ప్రయాణం నేటికీ అమలు కాలేదన్నారు. తల్లికి వందనం పథకం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని చెప్పినా 20204–2025 విద్యా సంవత్సరం పూర్తయినా ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. ప్రతి మహిళకు రూ.18 వేలు ఇస్తామని మోసగించారని మహిళలు తెలియజేశారు. ఇక అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని రైతులు మాజీ మంత్రి ఎదుట వాపోయారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ జగనన్న కులమతాలకు అతీతంగా పథకాలు అందించారన్నారు. పేదలకు మేలు జరగాలంటే జగనన్నను మరోసారి సీఎం చేసుకుందామని ప్రజలకు సూచించారు. అనంతరం ఆమే నాలుగో వార్డుకి సంబంధించి పార్టీ బూత్ కమిటీతో పాటు ఇతర అనుబంధ కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి, పట్టణ కన్వీనర్ మేదర శంకర, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రఘురామిరెడ్డి, ట్రెజరర్ బాలన్నగారిపల్లి రామకృష్ణారెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ మాజీ మెంబర్ గంపలవెంకటరమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉగ్రవాద దాడి హేయమైన చర్య



మృతులకు సంతాపం తెలియజేస్తున్న ముస్లిం ఐక్యవేదిక సభ్యులు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ముస్లిం పెద్దలు

హిందూపురం: ఉగ్రవాద దాడి చేయమైన చర్య. తీవ్ర వాదుల దుర్మార్గానికి ప్రతీకారం తప్పక చూపాలని ముస్లిం ఐక్య వేదిక నాయకులు నినాదించారు. గురువారం సాయంత్రం హిందూపురం జామియా ఈద్గా సర్కిల్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు వద్ద అమరులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్‌ఖాన్, సభ్యులు ఇందాద్, అజమ్‌తుల్లాఖాన్ మాట్లాడుతూ.. భారతదేశంలో ఐక్యమత్యంతో తీవ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకలిద్దామన్నారు. ఇలాంటి దాడులతో దేశంలో శాంతి సామరస్యాలు జాతీయ సమైక్యత దేశ సుస్థిరతను భంగం చేస్తూ రాజకీయాలు చేయడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో ముస్లిం ఐక్య వేదిక సభ్యులు మౌలానా షాబుద్దీన్, మౌలానా అన్సారీ, జమీల్, అమానుల్లా, చాంద్ బాషా, బిలాల్ అమీన్, 313 కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల శాంతి ర్యాలీ

గోరంట్ల: పహల్గాంలో ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ గురువారం రాత్రి పట్టణంలో ముస్లింలు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడుల్లో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకురాలని, ఉగ్రవాదులను దాడులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

పావగడ: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ ప్రాంతంలో పర్యాటకులను హత్య చేసిన ఉగ్రవాదుల దుశ్చర్యను జామియా మసీదు ముతవల్లి లతీఫ్ ఖండించారు. తాలూకా కార్యాలయంలో గురువారం ఆందోళన చేశారు. ముస్లిం నాయకులు మహ్మద్ ఫజులుల్లా, మహ్మద్ అన్వర్, ఇమామ్, ఆర్‌టీ ఖాన్, ముబారక్, షౌకత్ అలీ, నౌజవాన్ అధ్యక్షుడు రియాజ్, షా బాబు, రిజ్వాన్, యూసుఫ్, సికందర్, కౌన్సిలర్ ఇమ్రాన్, షమి ఉల్లా పాల్గొన్నారు, తహసీల్దార్ వరదరాజుకు వినతి పత్రం అందించారు.

వైభవంగా సత్యసాయి ఆరాధనోత్సవం



ప్రసాదం అందజేస్తున్న దృశ్యం

పెనుకొండ: పట్టణంలో గురువారం భగవాన్ సత్యసాయిబాబా ఆరాధనోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సత్యసాయి బాబా చిత్రపటాన్ని వీధుల్లో ఊరేగిస్తూ నగర సంకీర్తన చేపట్టారు. భగవాన్ సత్యసాయి బాబా చిత్రపటాన్ని ఊరు వాకిలి ఆంజనేయస్వామి గుడి వద్ద ఉంచి భక్తిశ్రద్ధలతో పూజలు, అఖండ భజనలు నిర్వహించారు. కర్పూర నీరాజనం నిర్వహించారు.

పావగడ: భగవాన్ సత్య సాయి బాబా 14 వ ఆరాధన మహోత్సవం సందర్భంగా స్థానిక భగవాన్ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రసాద వినియోగం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సమితి కన్వీనర్ రామ్ ప్రసాద్ మాట్లాడుతూ.. 14 ఏళ్లుగా సత్య సాయి బాబా ఆరాధనోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సమితి సభ్యులు, పదాధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



రొళ్ల మండలం టీడీ పల్లిలో ఆలయం చుట్టూ జ్యోతులతో ప్రదక్షిణ చేస్తున్న మహిళలు



వడిసిలమ్మ, మారెమ్మ దేవతలను ఊరేగిస్తున్న దృశ్యం

రొళ్ల: మండలంలోని టీడీ పల్లి గ్రామాల్లో కొల్హాపురి మహాలక్ష్మీదేవికి జ్యోతుల ఉత్సవాన్ని గురువారం నిర్వహించారు. గ్రామదేవత మారెమ్మ, సమీపాన వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అర్చకులు మూల విగ్రహాన్ని పట్టు వస్త్రాలు, వెండి, బంగారు ఆభరణాలు, పూలతో అలంకరించారు. తర్వాత స్వామివారికి అంకురార్పణ, అభిషేకం, కుంకుమార్చన చేసి మహా మంగళారతి చేశారు. ఊరేగింపుగా జ్యోతులను ఆలయం వద్దకు తీసుకొచ్చి ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి జ్యోతులను సమర్పించారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

వైభవంగా దేవతామూర్తుల ఊరేగింపు

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రం పంచాయతీలో జాతర ఉత్సవాల్లో భాగంగా గురువారం వడిసిలమ్మ, గౌడుసంద్రమారెమ్మ దేవతమూర్తులను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. గౌడు సంద్ర మారెమ్మను గ్రామంలోని ఆలయంలోకి, వడిసిలమ్మను గ్రామాల మీదుగా ఊరేగింపుగా ఆర్ అనంతపురంలోని ఆలయంలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

సంక్షిప్త సమాచారం

పరామర్శ

రొద్దం: ఆర్.లోచెర్ల గ్రామానికి చెందిన విశ్రాంత వీఆర్‌ఓ సిద్దారెడ్డి భార్య గంగమ్మ గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు, మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ, మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ గ్రామానికి చేరుకుని గంగమ్మ మృతదేహానికి పూమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ రైతు సంఘం మండల కమిటీ ఎన్నిక

మడకశిరరూరల్: ఏపీ రైతు సంఘం మండల కమిటీని గురువారం ఎంపిక చేశారు. పట్టణంలో సమావేశం నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, ప్రధాన కార్యదర్శి పెద్దన్న ఆధ్వర్యంలో మండల కమిటీని ఎంపిక చేశారు. రైతుల ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

వాహనాల తనిఖీ

లేపాక్షి: మండలంలోని పులమతి రోడ్డులో గురువారం హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ ఆధ్వర్యంలో పోలీసులు రోడ్డు భద్రతపై వాహనాదారులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా వాహనాదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని తెలిపారు. హెల్మెట్ ధరించాలని, భీమా సౌకర్యం కలిగి ఉండాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం వాహనాలను తనిఖీ చేశారు.

కంటెయినర్ అపహరణ

మడకశిర: పట్టణంలో ఓ కంటెయినర్ గురువారం అపహరించినట్లు సమాచారం. పట్టణంలోని హిందూపురం రోడ్డులో ఈ కంటెయినర్ అపహరణకు గురైనట్లు తెలిసింది. రోడ్డు పై కంటైనర్‌ను నిలిపి డ్రైవర్, క్లీనర్ భోజనం చేయడానికి హోటల్‌కు వెళ్లినప్పుడు గుర్తు తెలియని వ్యక్తులు కంటైనర్‌ను తీసుకెళ్లినట్లు తెలిసింది. అయితే దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు రాలేదు. ఈ విషయమై పట్టణ సీఐ నగేష్‌బాబు మాట్లాడుతూ.. ఈ చోరీపై తనకు ఫిర్యాదు రాలేదని తెలిపారు.

ప్రమాదబీమాతో ఆర్థిక భరోసా

హిందూపురం: పోస్టల్ ప్రమాద బీమాతో కుటుంబానికి ఆర్థిక భరోసా ఉంటుందని హిందూపురం హెడ్‌పోస్ట్ మాస్టర్ మార్కెండేయులు అన్నారు. ప్రమాద జీవిత బీమా మేళాలో భాగంగా గురువారం హిందూపురం హెడ్‌పోస్టాఫీసులో పరిగి ఎంఈఓ లక్ష్మీదేవి ఆఫీసులో పని చేసే పది మందికి రూ.5,500 సొంత డబ్బు చెల్లించి ప్రమాద జీవిత బీమా చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ వేణుగోపాల్, పోస్ట్‌మెన్ రాజ్‌కుమార్ తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలు



మాట్లాడుతున్న డాక్టర్ అబ్దుల్ రహీం

హిందూపురం: వేసవి సీజన్‌లో గొర్రెలు మేకలకు సోకే క్లోస్ట్రిడియం పెర్ఫ్రింజెన్స్ బ్యాక్టీరియా నివారణకు వ్యాక్సినేషన్ చేపట్టనున్నట్లు బేవనహళ్లి రైతు సేవా కేంద్రం పశువైద్య సహాయకుడు డాక్టర్ షేక్ అబ్దుల్ రహీం తెలిపారు. గురువారం మండలంలోని బేవినహళ్లిలో గొర్రెలు మేకలకు ఈటీ వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ద్వారా గొర్రెలు మేకలకు ఈటీ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లోని జీవాల పాకల వద్దనే వ్యాక్సిన్ వేసే కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. వేసవిలో గొర్రెలు మేకల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ వ్యాక్సిన్ అవసరమన్నారు. వ్యాధి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా జీవాల ఆకస్మిక మరణాలు తగ్గించి రైతులు ఆర్థికస్థితిని మెరుగుపర్చుకోవచ్చన్నారు. ఎంపీటీసీ అశ్విని, నాగరాజు, చంద్ర, సోమయ్య, ఆయకట్టు డైరెక్టర్లు గోపాలప్ప మంజునాథ్ పాల్గొన్నారు.

ఉష్ణోగ్రత సమాచారం

హిందూపురం	38.0
పెనుకొండ	41.0
మడకశిర	38.0

మంత్రి పర్యటన రేపటికి వాయిదా

మడకశిర: రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి మడకశిర పర్యటన శనివారానికి వాయిదా పడినట్లు ఆర్టీసీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. మంత్రి ముందుగా నిర్ణయించిన ప్రకారం శుక్రవారం పర్యటించాల్సి ఉందని తెలిపారు. అనివార్య కారణాల వల్ల మంత్రి పర్యటన శనివారానికి వాయిదా పడినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహమూర్తి

సోమందేపల్లి: సోమందేపల్లిలోని మేజర్ పంచాయతీ కార్యాలయంలో గురువారం పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ గంగాదేవి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, గ్రామంలో అన్ని రకాల మౌళిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఘనంగా జాతీయ పంచాయతీ దినోత్సవాన్ని కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో జరుపుకున్నారు. పంచాయతీ సిబ్బంది, కార్మికులు, సచివాలయం సిబ్బంది పాల్గొని ర్యాలీ నిర్వహించారు.

లేపాక్షి: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీఓ నరసింహామూర్తి మాట్లాడుతూ.. పంచాయతీ రాజ్ చట్టంలో ఉన్న నిమయ నిభంధనలనకు అనుగుణంగా పరిపాలన చేయాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఆనంద్ కుమార్, లేపాక్షి, పులమతి సర్పంచులు ఆదినారాయణ, అశ్వర్థ నారాయణ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వీఎస్ఎస్ఎన్ అధ్యక్షుడిగా వీరభద్రప్ప



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని మంగళవాడ వీఎస్ఎస్ఎన్ (వ్యవసాయ సహకార సంఘం) నూతన అధ్యక్షుడిగా జంగమరహళ్లి వీరభద్రప్ప, ఉపాధ్యక్షుడిగా బుడతనహళ్లి గిరియణ్ణ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సంఘంలో మొత్తం 12 మంది సభ్యులు ఉండగా.. వారిద్దరే నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఎలాంటి పోటీ లేకుండా ఏకగ్రీవంగా గెలుపొందారని ఎన్నికల అధికారి వెంకటేశ్ ప్రకటించారు. జెడ్పీ మాజీ సభ్యుడు మంజునాథ్, పీఎల్‌డీ బ్యాంకు మాజీ అధ్యక్షుడు గోపాల్ గౌడ తదితరులు అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందించారు.

3వ తేదీన మున్సిపల్ అధ్యక్ష స్థానానికి ఎన్నికలు



ఇన్‌చార్జ్ అధ్యక్షురాలిని అభినందిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక మున్సిపల్ అధ్యక్ష స్థానానికి వచ్చే మే నెల 3న ఎన్నికలు జరగ నున్నట్లు మున్సిపల్ ముఖ్యాధికారి జాఫర్ షరీఫ్ గురువారం తెలిపారు. ఈ ఎన్నికలకు సంబంధించి కలెక్టర్ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. మున్సిపల్ అధ్యక్షుడు పీహెచ్ రాజేశ్ రాజీనామాతో ఖాళీ పడిన స్థానానికి నిబంధనల మేరకు ఇన్‌చార్జ్ అధ్యక్షురాలిగా స్థానిక మున్సిపల్ ఉపాధ్యక్షురాలు గీతా హనుమంతరాయప్పను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ మంత్రి వెంకటరమణప్ప, ఎమ్మెల్యే వెంకటేశ్ సూచనల మేరకు తనను ఇన్‌చార్జ్ అధ్యక్షురాలిగా ఎంపిక చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.